క్లుప్తంగా

వాలీబాల్‌పై శిక్షణ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణ వాలీబాల్‌ను ఏర్పాటు చేశారు. గురువారం క్రీడా శిక్షణను ఉప సర్పంచ్ సయ్యద్ రెహ్మాన్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మద్దిలేటి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో వాలీబాల్ నేర్చుకునేందుకు ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెడు వ్యసనాలను దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు గౌడు, మనోహర్ రెడ్డి, సుందర్ రెడ్డి, పీఈటీ భరత్ కుమార్, రాజు, రైతు సంఘం సభ్యులు కొండన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

మల్దకల్: మండల కేంద్రంలోని రైతు సంబరాల ప్రాంగణంలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను శుక్రవారం గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని గురువారం సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్

ఉండవెల్లి: క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని పీఈటీ స్వాములు అన్నారు. గురువారం మండలంలోని మెన్నిపాడు, కలుగోట్ల గ్రామాల్లో స్వేరో టీం సభ్యులతో కలిసి క్రీడలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13, 14వ తేదీల్లో అయిజలో స్వేరోస్ ఆధ్వర్యంలో ఓపెన్ క్రికెట్, జూనియర్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం మార్పు

మానవపాడు: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని చంద్రశేఖర్‌నగర్ స్టేజీలో ఉన్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలుకుంట్లలోని రైతు సమన్వయ సమితి కార్యాలయానికి మార్చుతునట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ మద్దిలేటి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భద్రత దృష్ట్యా మార్చుతునట్లు పేర్కొన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

నష్టపరిహారం చెల్లించాలి

గద్వాల అర్బన్: అకాలవర్షంతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అతిఖుర్ రహ్మాన్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసినా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వెంకటపురం, చాగదోన, ర్యాలంపాడు, అలూరు, మల్దకల్, గట్టు తదితర ప్రాంతాల్లో రైతులు వరి, పత్తి, వేరుశనగ తదితర పంటలు సాగు చేశారని అకాల వర్షాలతో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. సంబంధిత అధికారులు పంటలను పరిశీలించి, నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు చెక్కుల పంపిణీ

అయిజ: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తహసీల్దార్ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే అబ్రహం హాజరవుతారని తహసీల్దార్ పేర్కొన్నారు. అర్హులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

సారా స్థావరాలపై దాడులు

కేటీదొడ్డి: కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు సందర్భంగా తెలంగాణ, కర్ణాటక సరిహద్దులోని పూజారితండా, సింగనేడితండాలో గురువారం తెలంగాణ, కర్ణాటక ఎక్సైజ్ సీఐ గోపాల్, కర్ణాటక ఇన్‌స్పెక్టర్ హనుమంతు, కవిత ఆధ్వర్యంలోని సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 50 లీటర్ల బెల్లం పానకం గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిని తహసీల్దార్ ముందుపై బైండోవర్ చేశారు. ఎస్‌ఐలు గోపాల్, గోవర్ధన్, రాజేందర్‌లు ఉన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

రాజోళి: మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ రెడ్డి ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనింగ్ అధికారులు విచ్చలవిడిగా మట్టి, ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నారని దీంతో ఇష్టానుసారంగా మట్టి, ఇసుకను తరలిస్తున్నారన్నారు. రాజోళి మండలంలో ఆయా నదీతీర గ్రామాల్లో నుంచి మైనింగ్ శాఖ అధికారుల అనుమతులను చూపుతూ, ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తున్నా అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజురోజుకు ఇసుకాసురుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని, మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి అనుమతులు ఇవ్వాలని కోరారు.

నీటి సంఘాలపై నిర్లక్ష్యం

- 15 ఏళ్లయినా నిర్వహించని ఎన్నికలు
- చెరువు, కుంటలపై కరువైన పర్యవేక్షణ



తిమ్మాపురం సేరి పెద్ద చెరువు(ఫైల్)



కోతకు గురై నీరు లేక ఎండిపోయిన ఇటిక్యాల లింగమ్మ చెరువు

ఎర్రవల్లిచౌరస్తా: రాష్ట్ర ప్రభుత్వం చెరువులలో నీటి నిల్వలను పెంచి అభివృద్ధి చేయడం కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువుల పూడికతీత పనులకు శ్రీకారం చుట్టింది. కాని చెరువులు, కుంటల అభివృద్ధి, వాటి నిర్వహణ, ఆయకట్టుకు నీటిని సరఫరా చేయడం, పర్యవేక్షణ కోసం ప్రభుత్వం నీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించడం మాత్రం మర్చిపోయింది. దీంతో ప్రస్తుతం చెరువులు, కుంటల పరిరక్షణ ఎంతో కరువైంది. మిషన్ కాకతీయ పథకం ద్వారా ప్రభుత్వం గ్రామాలలోని చెరువులను, కుంటలను శుభ్రం చేసి పునరుద్ధరించింది. కానీ నీటి సంఘాలకు, పాలక వర్గాలు లేకపోవడంతో చెరువులు ఆక్రమణకు గురైనా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఇప్పటికే నియోజకవర్గంలోని చాలా చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయని ఆయా మండలాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో చెరువులపై పర్యవేక్షణ ఇలా..

ప్రభుత్వం సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్ విడుదల చేయగానే వంద ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టు రైతులు చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లను ఎన్నుకునేవారు. ఎన్నికైన పాలక వర్గ సభ్యులు చెరువులు, కుంటల నిర్వహణతో పాటు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకోవడంతో పాటు నీటిని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. అంతే కాకుండా రైతులను ఎప్పటికప్పుడూ సమన్వయపర్చుకుంటూ వివిధ అభివృద్ధి పనులు నిర్వహించేవారు. 15 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయి.

2008 నుంచి ఎన్నికల జాడేలేదు..

అలంపూర్ నియోజకవర్గంలో వంద ఎకరాల ఆయకట్టు, అంతకంటే తక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు, కుంటలు మొత్తం 114 ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2006లో రాష్ట్ర వ్యాప్తంగా వంద ఎకరాలు ఆయకట్టు ఉన్న చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవి కాలం కేవలం రెండేళ్ల మాత్రమే ఉండటంతో 2008 లోనే వారి పదవి కాలం ముగిసింది. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు సాగునీటి సంఘాలకు తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడి ఎనిమిది సంవత్సాలు గడిచినా నీటి సంఘాల ఎన్నికల మాట ఊసెత్తడం లేదు. ప్రభుత్వం ప్రతి చెరువులో కూడా మిషన్ కాకతీయ పనులను చేపట్టింది. కానీ నీటి సంఘాలు ఏర్పాటు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకొని దండుకున్నారు. దీనివల్ల పలు చెరువులు, కుంటలు వర్షాకాలంలో కోతకు గురై నీరు పూర్తిగా బయటికి వెళ్లింది. దీనివల్ల ఆయకట్టు రైతులు పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చెరువులు, కుంటల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి వాటిని మరింత అభివృద్ధి చేయాలని ఆయా మండలాల ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఆయా మండలాల వారీగా చెరువు, కుంటల వివరాలు ఇలా..

మండలం	జీపీలు	చెరువులు, కుంటలు
ఇటిక్యాల	29	44
మానవపాడు	16	06
ఉండవెల్లి	16	03
అలంపూర్	14	08
రాజోలి	11	04
వడ్డేపల్లి	10	05
అయిజ	28	44

నీటి సంఘాలతోనే చెరువుల అభివృద్ధి



నీటి సంఘాల సభ్యులతో చెరువులపై పర్యవేక్షణ ఉంటుంది. గతంలో నీటి సంఘాలు ఉండటం వల్ల నీటి పొదుపుతో పాటు పర్యవేక్షణ ఉండేది. ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేసింది. కానీ కాంట్రాక్టర్లు చెరువులలోని పూడికతీత పనులను మాత్రం సక్రమంగా చేయలేదు. నీటి సంఘాలు ఉంటే పనులు సక్రమంగా జరిగేవి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులను అభివృద్ధి చేయాలి.

– లక్ష్మన్న, రైతు, సాసనూలు

ప్రభుత్వం ఆదేశిస్తే ఎన్నికలు నిర్వహిస్తాం..



వంద ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులకు నీటి సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్పకుండా నోటిఫికేషన్ జారీ చేసి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తాం. గతంలో చెరువుల అభివృద్ధి పనులు నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు చూసుకునేవారు. ప్రస్తుతం నీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో ఎన్నికల ప్రక్రియను చేపట్టడం లేదు.

– సుబ్రమణ్యం, తహసీల్దార్, ఇటిక్యాల

అధిక ధరలతో సతమతం



ప్రజాపోరుయాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

అలంపూర్ రూరల్: సామాన్య ప్రజలు అధిక ధరలతో సతమతమవుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యం బాలనర్సింహ అన్నారు. గురువారం మండలంలో ఇంటింటికి సీపీఐ ప్రజా పోరుయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామాన్యుల నడ్డి విరిచే విధంగా అధిక ధరలతో సామన్య ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. అధికార దాహంతో ప్రజల్లో మతం పేరుతో చిచ్చు పెట్టేందుకు కుయుక్తులు చేస్తున్నారని, సంపన్నులకే మేలు చేసేందుకు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యదర్శి పెద్దబాబు, జిల్లా సమితి సభ్యులు చెన్నయ్య, రామాంజనేయులు, వెంకట్రాముడు, ఆశన్న, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు, మహేష్, ప్రవీణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడి జేపీఎస్‌ల నిరసన



బతుకమ్మ ఆడి నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

గద్వాల అర్బన్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహిళ కార్యదర్శులు బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొబేషనరీ కాలం పూర్తయినా ప్రభుత్వం జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయలేదని వాపోయారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పాండు, బసిరెడ్డి, నిరంజన్, పరమేశ్, రియాజ్, శశికళ, రజిత, సలేహా ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలు

ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలో గురువారం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అమ్మవారి, స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కల్యాణం తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అర్చకులు కల్యాణతంతును వేదమంత్రాల నడుమ జరిపించారు. అనంతరం ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుని కల్యాణం కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రంగుమారిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పెబ్బేరు రూరల్: కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి తడిసి రంగుమారిన ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆయన గురువారం శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యం, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, వర్షానికి వేరుశనగ పూర్తిగా బూజు వచ్చి నల్లగా మారి కుళ్లిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరానికి రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల విషయంలో రాజకీయాలు మానుకొని నిజాయతీగా రైతుల పక్షాన నిలబడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడితో అవస్థలు



మానవపాడు: మండల ప్రజలు తాగునీటి ఎద్దడితో సతమతమవుతున్నారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించాలన్న లక్ష్యంతో మిషన్‌భగీరథ పథకాన్ని సత్ఫలితాలను ఇవ్వడం లేదు. తాగునీరు అందక మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని బ్లాక్ ఆఫీస్‌లో 20 రోజుల నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మహిళలు బిందెలు పట్టుకొని నిరసన తెలిపారు. తాగునీరు సరఫరా కావడం లేదని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

వైభవంగా గ్రామ దేవతల ఉత్సవాలు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు, మండలంలోని కొంకల, వెంకట్రామనగర్ గ్రామాల్లో వెలసిన గ్రామ దేవతల ఉత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పెద్దమ్మ, సవారమ్మ, ఈదమ్మ, మారెమ్మ, కర్రెమ్మ, జమ్ములమ్మ, తాయమ్మ అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల పరిసరాలు వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. బంధువులు, స్నేహితులకు విందుభోజనాలు ఏర్పాటుచేశారు. ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, జోగుళాంబగద్వాల, కర్నూలు, రాయచూర్ జిల్లాలకు చెందిన బంధుమిత్రుల రాకతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం



మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతుందని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. నెలనెలా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధరణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, జ్యోతి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం



ఉలిగేపల్లిలో కంటి పరీక్షలు పరిశీలిస్తున్న ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ

మల్దకల్: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉలిగేపల్లిలో సర్పంచు చిన్నరాముడుతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులతో పాటు ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి పరీక్షల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్, స్వరూపరాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తప్పెట్లమొర్సు సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, వైద్యాధికారి తిమ్మప్పలు కోరారు. గురువారం తప్పెట్లమొర్సులో కంటి వెలుగు శిబిరాన్ని ఉప సర్పంచ్ దేవమ్మ, వైద్యాధికారి తిమ్మప్పలతో కలిసి సర్పంచ్ కృష్ణయ్యగౌడ్ ప్రారంభించారు. తప్పెట్లమొర్సు, మల్లంపల్లి, ఇందువాసి గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. మూడు గ్రామాల్లో మొత్తం 415 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 22 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 27 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నర్సింహులు, సౌజన్య, సూపర్‌వైజర్లు మక్సూద్, స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్‌ఎంలు రేష్మ, ఈశ్వరమ్మ, జగదీశ్వరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని బస్వాపురంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో మూడోరోజు గురువారం 187 మందిక కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్య బృందం హేమమానస, రాజారావు, బాలీశ్వర్ శెట్టి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాజాతా బృందం

ధరూరు: సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ వెంకట్రాములు అన్నారు. గురువారం జిల్లా ఎస్పీ సృజన ఆదేశానుసారం మండలంలోని మన్నాపురంలో షీ టీం, పోలీసు కళాజాతా బృందం, భరోసా టీం ఆధ్వర్యంలో ప్రజలకు, యువకులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వల్ల ఎన్నో రకాల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే సైబర్ నేరాలతో చాలా మంది మోసపోతున్నారన్నారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమన్నారు. పోలీసు చట్టాలు, సీఈఐఆర్ వినియోగం గురించి వివరించారు. పాన్ కార్డు అప్‌డేట్ కోసం లింకులు వస్తే ఓపెన్ చేయొద్దన్నారు. యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండన్నారు. కార్యక్రమంలో షీ టీం, కళాబృందం సభ్యులు రాధమ్మ, కృష్ణ, రామాంజనేయులు, రామిరెడ్డి, శేషన్న, భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి



నాగర్‌దొడ్డి సమీపంలో కల్వర్టు

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి స్టేజీ సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద సూచిక బోర్డు వాహనదారులు కోరుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి సూచిక బోర్డు ఏర్పాటు చేయలేదని వాపోయారు. ప్రతి నిత్యం వందలాది వాహనదారులు ఈదారి గుండా రాకపోకలు కొనసాగిస్తారని పేర్కొన్నారు. రాత్రివేళలో కల్వర్టు సమీపంలో ఉన్న గుంత కనిపించక అందులో పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు సమీపంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మేడికొండను మండలంగా ప్రకటించాలి



నినాదాలు చేస్తున్న మేడికొండ గ్రామస్తులు

అయిజ: ఆర్డీఎస్ ఆయకట్టు ప్రాంతానికి కేంద్రంగా ఉన్న మేడికొండను నూతన మండలంగా ప్రకటించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశానికి గ్రామస్తులు హాజరయ్యారు. గ్రామాన్ని మండలంగా ప్రకటించేవరకు ఉద్యమాలు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ మండల ఏర్పాటుకు అన్ని రకాల వసతులు, అన్ని గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. మేడికొండ రవాణా పరంగా అన్ని గ్రామాలను కలిపేందుకు కేంద్రంగా ఉందన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అబ్రహం స్పందించి మేడికొండ గ్రామాన్ని నూతన మండలంగా చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. అనంతరం గ్రామస్తులు నినాదాలు చేసి మద్దతు తెలిపారు.

ప్రజలకు సేవలందించడం అదృష్టం



గద్వాలలో పటాకులు కాలుస్తున్న డీకే అరుణ

గద్వాల: ప్రజలకు సేవలందించడం అదృష్టంగా భావిస్తునట్లు మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో పార్టీ కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు పుష్పగుచ్ఛాలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ కార్పొరేటర్లు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు సమాజ సేవలో పాల్గొనాలని సూచించారు. గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, త్యాగరాజు, కుమ్మరి శ్రీను, వెంకటేశ్వర్‌రెడ్డి, పద్మావతి, కృష్ణవేణి, జయశ్రీ, అనిత పాల్గొన్నారు.

154 మంది రక్తదానం

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ జన్మదినం పురస్కరించుకొని స్థానిక డీకే బంగ్లా ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో మొత్తం 154 మంది రక్తదానం చేశారు. డీకే అరుణ జన్మదినాన్ని పురస్కరించుకుని కౌన్సిలర్ త్యాగరాజు ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో, నాయకుడు కరాటే సత్యం పాతబస్టాండు చౌరస్తాలో పేదలకు అన్నదానం చేశారు.

అయిజ: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పుట్టిన రోజును పురష్కరించుకొని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ కన్వీనర్ మెడికల్ తిరుమలరెడ్డి, ప్రదీప్ కుమార్, భగత్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

వారం రోజులైనా పట్టించుకోరా..?



పెద్దపాడు-చిన్నపాడు గ్రామాల మధ్య నేలకొరిగిన విద్యుత్‌స్తంభం

ధరూరు: మండలంలోని పెద్దపాడు – చిన్నపాడు గ్రామాల మధ్య ఆరు రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి విద్యుత్ తీగలు తెగిపోయాయి. స్తంభాలు నేలకొరిగాయి. సరి చేయాల్సిన విద్యుత్ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో నిలిచింది. దాదాపు 200 ఎకరాలు చీని తోటకు సాగునీటి ఇబ్బందులు ఎదురయ్యాయి. పత్తి, పండ్ల సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

అన్ని రంగాల్లో బీఆర్‌ఎస్ వైఫల్యం



కార్యకర్తలతో మాట్లాడుతున్న సంపత్ కుమార్

అయిజ: అన్ని రంగాల్లో బీఆర్‌ఎస్ వైఫల్యం అయ్యిందని ఏఐసీసీ కార్యదర్శి ఎస్‌ఏ సంపత్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ టౌన్ బీసీ సెల్ అధ్యక్షుడు సాంబశివుడు నివాసంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, వైఫల్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంపత్‌కుమార్ మాట్లాడుతూ అధికార పార్టీ ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.